www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024

వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

అంతర్జాతీయ స్థాయిలో

గండికోటకు ప్రత్యేక స్థానం

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
గండికోటలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

అంతర్జాతీయ టూరిజం మ్యాప్‌లో గండికోట పర్యాటక కేంద్రానికి ప్రత్యేక స్థానాన్ని తీసుకొస్తామని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గండికోట పర్యాటక కేంద్రంలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేసిన పలు నిర్మాణాలకు కలెక్టర్ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి, జెసి అదితి సింగ్, డిఎఫ్ఒ సందీప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికలో కలెక్టర్ మాట్లాడుతూ గండికోటకు ఒక చరిత్ర ఉందని ఈ ప్రాంతాన్ని దేశంలో ప్రసిద్ధి గాంచిన ప్రదేశంగా గుర్తుండిపోయేలా అభివృద్ధి అభివృద్ధి చేస్తామని చెప్పారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోట ఉత్సవాలు అందరి సహకారంతో అత్యంత ఘనంగా నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న రోప్‌వే ద్వారా గండికోట గార్జ్, పెన్నానది అందాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయన్నారు. గండికోటలో ఒబెరాయ్ సంస్థ వారు 5 స్టార్ రిసార్ట్‌ను కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. రాబోయే రోజులలో గండికోటను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కడప జిల్లాలో అనేక చారిత్రక, పర్యటక, దర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయని ఈ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు వెళుతున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగ వాతావరణంలో అంగరంగ వైభవంగా గండికోట ఉత్సవాలను జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. గండికోట పర్యాటక అభివృద్ధితో జమ్మలమడుగు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గండికోటలో గ్రాండ్ కానియన్ లో మంచి అద్భుతమైన లోయలు ఉన్నాయన్నారు. త్వరలో మరో థర్మల్ పవర్ కేంద్రం కూడా స్థాపితం కానుందన్నారు. ఉత్సవాల వేడుకల్లో భాగంగా ప్రొద్దుటూరు నృత్య తరంగిణి, జమ్మలమడుగు పరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు, విభిన్న ప్రతిభావంతులైన కామిశెట్టి వెంకట్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఉర్రూతలూగించాయి. విద్యుద్దీపాలంకరణతో గండికోట ప్రాంతం కన్నులవిందు చేసింది. అనంతరం ఇంటాక్ సంస్థ వారు ప్రచురించిన గండికోట ఇన్ఫర్మేషన్ పాకెట్ డైరీ, తెలుగు రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి రచించిన గండికోట బుక్ (5వ ఎడిషన్) అవిష్కంరించారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులు, కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యువనాయకులు భూపేష్‌రెడ్డి, జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, గండికోట సర్పంచ్ గురు ఈశ్వర్, ఎంపిటిసి పద్మావతమ్మ, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, టూరిజం మేనేజర్ రాం కుమార్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుల రిజర్వేషన్ల కేసు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ 2022, నవంబర్ 28న 6,100 ఉద్యోగాలకు విడుదల చేశారని, ఇందులో క్వాలిఫై అయిన అభ్యర్థులకు వెంటనే హోంగార్డుల రిజర్వేషన్ కేసును పూర్తి చేసి ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిఎస్‌పి లో 8 నుంచి 15శాతం, సివిల్ 15 నుంచి 25శాతం పెంచడం వల్ల పోలీస్ బోర్డు హైకోర్టుకు వెళ్లిందని పేర్కొన్నారు. కేసు హియరింగ్‌కు ప్రభుత్వం నుంచి ఒక్కరు కూడా హాజరు కాలేదని తెలిపారు. అభ్యర్థులకు హోంగార్డులకు మధ్య తగాదాగా మార్చి రెండు పక్కల ప్రభుత్వమే ఉంటూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. కోర్టు కేసు పరిష్కరించి డిసెంబరు లోపు పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 95,208 మంది రోడ్లపైకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు సమావేశంలో నగర కన్వీనర్ విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ ఎడిగా పిచ్చేశ్వరరావు

ప్రజాశక్తి - కడప అర్బన్

బాధ్యతలు స్వీకరిస్తున్న పిచ్చేశ్వరరావు

చేనేత, జౌళి శాఖ కడప ఎడిగా బి.పిచ్చేశ్వరరావు శుక్రవారం కలెక్టోరేట్‌లోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో పని చేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలను అభివృద్ధిపథంలో తీసుకువెళ్తానని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయనకు డిఒలు, ఎడిఒలు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అరుదైన నేత సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో వివిధ పార్టీల నాయకులు

ఎం.ఎ.గఫూర్

ఎన్.తులసిరెడ్డి

జి.చంద్రశేఖర్

బి.నారాయణ

జి.చంద్ర

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

దేశ రాజకీయాల్లో అరుదైన నాయకులు సీతారాం ఏచూరి అని వివిధ పార్టీల నాయకులు అన్నారు. గొప్ప లౌకిక విలువలు కలిగిన మహాయోధుడిని కోల్పోయామన్నారు. ఏచూరి స్ఫూర్తితో లౌకిక, ప్రజాస్వామ్య, అభ్యుదయ శక్తులు ఐక్యంగా మతోన్మాద విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను కడప ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఏచూరి చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామిక మౌలిక విలువల పరిరక్షణ కోసం అరహరం శ్రమించిన గొప్ప నాయకున్ని కోల్పోవడం బాధాకరమన్నారు. పార్లమెంట్‌కు దారిదీపం లాంటి నాయకుడిని దేశం కోల్పోయిందని పరస్పర బిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీల నాయకత్వాలు (ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, సోని యాగాంధీ) పేర్కొనడాన్ని గుర్తు చేశారు. గొప్ప లౌకిక విలువలు కలిగిన మహాయోధుడిని కోల్పోయామన్నారు. జెఎన్‌యుకు మూడు సార్లు అధ్యక్షునిగా పనిచేసిన ఘనత వహించారన్నారు. సిపిఎంలో అగ్రగణ్యులైన పుచ్చలపల్లి సుందరయ్య, బసవపున్నయ్య, హరికిషన్‌సింగ్ సూర్జిత్ వంటి ఉద్దండుల సాహచర్యంలో ఎదిగారన్నారు. ప్రపంచంలో సోషలిస్టు దేశాలు కూలుతున్న సమయంలో సోషలిజమే ప్రపంచానికి శరణ్యమని తీర్మానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ మౌలిక విలువల్ని నాశనం చేస్తున్నారని, రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఎన్డీయే ప్రభుత్వానికి లేదని చేసిన ప్రసంగం చర్చనీయాంశంగా మారిందన్నారు. పిసిసి అధికార ప్రతినిధి ఎన్. తులసిరెడ్డి మాట్లాడుతూ ఏచూరి విలక్షణ, విశిష్టత, వ్యక్తిత్వం కలిగిన నాయకునిగా నిలిచిపోయాడన్నారు. దేశంలోని ఆరు జాతీయ పార్టీల్లో సిపిఎం ఒకటని, అటువంటి పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అరుదైన నాయకునిగా నిలిచారన్నారు.

బి.మనోహర్

ఐ.ఎన్.సుబ్బమ్మ

ఎస్.గుర్రప్ప

రాజ్యసభలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలవడంతోపాటు దేశంలోని ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటములకు ఇరుసుగా నిలిచా రన్నారు. ప్రజాస్వామ్యవాది, లౌకికవాది, సామ్యవాది, రాజ్యాంగ పరిరక్షణవాదిగా కీర్తి గడించారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలిగా నిలిచారన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవ దానం చేయడం చూశామని, తన పార్థివ దేహాన్ని సైతం సమాజ హితం కోసం ఎయిమ్స్‌కు అప్ప గించిన అరుదైన గొప్ప నేతల్లో ముందు వరుసలో నిలుస్తారని కొనియాడారు. సిపిఎం జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణ మాట్లాడుతూ సోషలిజం పరివర్తన దశకు చేరుకోవాలంటే మతతత్వ శక్తులను పారదోలాలని చెప్పారని గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ మాట్లాడుతూ యునైటెడ్‌ఫ్రంట్, యుపిఎ, ఇండియా కూటముల ఏర్పాటులో ఏచూరి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ జెఎన్‌యు ఎన్నికల్లో వామ పక్షాల గెలవడం వెనుక ఏచూరి స్ఫూర్తి ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం మొదలుకుని విద్యార్థి ఉద్యమం వరకు ఏచూరి పోరాట పటిమ ఎన్నదగ్గదని కొనియాడారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు డబ్ల్యు.రాము, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు రమణయ్య మాట్లాడుతూ దేశం సంక్షోభ సమయంలో ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆర్ ఎస్‌పి జిల్లా నాయకులు కె.సుబ్బరాయుడు మాట్లా డుతూ ఐక్యఉద్యమాలతోనే ఫాసిస్టులను ఓడిం చగలమన్నారు. ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా నాయకులు జయవర్ధన్ మాట్లాడుతూ ఏచూరి అందించిన స్ఫూర్తితో ముందుకెళ్తామన్నారు. బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప మాట్లాడుతూ ఏచూరి దేశానికి చేసిన అపారమని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రతినిధి డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏచూరి నిస్వార్థ ప్రజాసేవకుడని కొనియాడారు. మహాజనపార్టీ నాయకులు ఎస్.మనోహర్ మాట్లాడుతూ సామ్యవాద, ప్రజా స్వామిక, సోషలిజం కోసం అరహరం కృషి చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. లోక్‌సత్తా నాయకులు డి.కృష్ణ మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మ మాట్లాడుతూ ఏచూరి గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఉపాధి హామీ చట్టం రూపకల్పనే నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మనోహర్, రామమోహన్, శివకుమార్, దస్తగిరిరెడ్డి, శ్రీని వాసులరెడ్డి, చంద్రారెడ్డి, సత్యం, శివకుమార్, జిల్లా నలుమూలల నుం చి ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రముఖులు, వృద్ధులు, మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు.

సీతారాం ఏచూరి సంతాప సభకు హాజరైన వామపక్ష మద్దతుదారులు, లౌకిక వాదులు, ప్రజాసంఘాల నాయకులు

జి.రమణయ్య

ఎస్.మనోహర్

ఎస్.హరీంద్రనాథ్

కె.సుబ్బరాయుడు

జె.జయవర్ధన్

డి.కృష్ణ

దేవర ఫ్యాన్స్ షోలో విషాదం

- సినిమా చూస్తూ గుండెపోటుతో అభిమాని మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్/ చింతకొమ్మదిన్నె

మృతిచెందిన మస్తాన్, మృతిడి ఫైల్‌ఫొటో (ఇన్‌సెట్‌లో)

నగరంలోని అప్సర థియేటర్‌లో జూనియర్ ఎన్‌టిఆర్ నటించిన దేవర చిత్రం విడుదల సందర్భంగా విషాదం చోటు చేసుకుంది. సినిమా చూస్తు ఒడగా ఓ అభిమాని ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అతన్ని హుటాహుటినా ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. వివరాలు.. నగరంలోని అప్సర థియేటర్‌లో అభిమానుల కోసం శుక్రవారం తెల్లవారు జామున ఫ్యాన్స్ షో వేశారు. అభిమానులు పెద్దఎత్తున వచ్చారు. ఇందులో భాగంగా చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన ఎన్‌టిఆర్ అభి మాని మస్తాన్ (26) సినిమాకు వచ్చాడు. సినిమా చూస్తున్న క్రమంలో ఈలలు, కేకలు వేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. తోటి ప్రేక్షకులు అతన్ని లేపేందుకు ప్రయత్నించగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. గుండెపోటుతో మృతిచెందాడని పేర్కొన్నారు. ఎంతో ఉత్సాహంగా తన అభిమాన హీరో సినిమా 'దేవర' చూసేందుకు వెళ్లిన వ్యక్తి ఇలా హఠన్మరణం చెందడం అక్కడి వారిని తీవ్రంగా కలచివేసింది. మృతుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి యజమాని మృతిచెందడంతో కుటుంబంతోపాటు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. **ప్రదర్శన సమయంలో అభిమానుల రచ్చ..** కడప నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న రాజా థియేటర్లో జూనియర్ ఎన్టీఆర్ నటించిన చిత్రం దేవర ఫ్యాన్స్ షో గురు వారం అర్ధరాత్రి ప్రదర్శన సందర్భంగా థియేటర్ వద్దకు పెద్ద ఎత్తున జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ చేరుకున్నారు. చాలామంది టిక్కెట్లు లేకుండా థియేటర్ లోపలికి ప్రవేశించడంతో పూర్తిగా నిండిపోయింది. ఈ క్రమంలో యాజమాన్యంకు, అభి మానులకు మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో పోలీ సులు రంగ ప్రవేశం చేసి టికెట్ లేని వారిని బయటికి పంపించడంతో గొడవ సద్దుమణిగింది. ఈక్రమంలో చాలామంది యువకులకు గాయాలైనట్లు తెలుస్తోంది.

కరాటే పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని గాయత్రి జూనియర్ కళాశాల, కెఆర్‌ఆర్‌ఎం స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారని కోచ్‌లు వెంకటేష్, ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కోడూరులో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారని తెలిపారు. రాష్ట్ర స్థాయి లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

వందరోజుల పాలనలో చేసిందేమీ లేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప : వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేసింది ఏమి లేదని, కానీ వై.ఎస్. జగన్ పై మాత్రం బురద జల్లుతున్నారని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీం ద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. తిరుమల లడ్డు వ్యవహారం వాళ్ల వైపే వేళ్లు చూపే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఒక మతంపై బురద చల్లడం చంద్రబాబు, పవన్‌కు బుద్ధి లేదని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్నీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రజలను మభ్యపెట్టడానికి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. జగన్ స్వామి వారి దర్శనానికి వెళ్తుంటే దానిపైనా విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులతో నోటీసులు ఇప్పించి నిలువరించే ప్రయత్నం చేయడం ఏమిటని ప్రశ్నించారు. లడ్డూ వ్యవహారాన్ని తమ స్వార్థ రాజకీయాలకు వాడు కుం టున్నారని చెప్పారు. విజయవాడలో గుళ్లను కూల్చిన వ్యక్తి చంద్రబాబు అయితే, వాటిని పునర్నిర్మించినది జగన్ కాదా అని ప్రశ్నించారు. జగన్ హిం దూ దేవాలయాలను ఎందుకు వెళ్ళకూడదో వారు చెప్పాలని పేర్కొన్నారు. దేశంలో ఎవరూ చేయని సంస్కృతిని చంద్రబాబు తీసుకొచ్చారని విమర్శి ంచారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, షఫీ, తోట కృష్ణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా

ప్రజాశక్తి - కడప

కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, కలుపు మొక్కలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తొలగించారు. వాలంటీర్లంతా కలిసి కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని, కళాశాల ఆవరణ శుభ్రపరచినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ అభినందించారు. ఇలాంటి స్వచ్ఛత కార్యక్రమాలు కళాశాల ఆవరణలోనే కాకుండా ముఖ్యమైన ప్రదేశాలు అన్ని చోట్ల విరివిగా చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి శివరామకృష్ణ, డాక్టర్ లీలా వర్ధిని, డాక్టర్ అంకాల నాగరాజు పాల్గొన్నారు. ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

ఎంఎస్ఎంఇ కేంద్రాన్ని మార్చొద్దు

ప్రజాశక్తి - కడప

ఎంఎస్ఎంఇ కేంద్రాన్ని మార్చొద్దు అని కాంగ్రెస్ యువ నేత మధు రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇంత వివక్ష పనికిరాదని అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధురెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం కొప్పర్తి సెజ్‌లో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 250 కోట్లతో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఇ శాఖ ఆమోదం కూడా తెలిపిందని పేర్కొన్నారు. అన్ని అనుమతులు రావడంతో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం మారడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించాలని ఈనెల 24న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని వాపోయారు. కడప జిల్లా వెనుకబడిన ప్రాంతం, ఈ ప్రాంతం అభివృద్ధి చెందకూడదా? ముఖ్యమంత్రి ఒకసారి ఆలోచించాలని పేర్కొన్నారు.

5 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్క్‌షాప్

ప్రజాశక్తి - కడప అర్బన్

అనంతపురంలో అక్టోబర్ 5, 6 ,7, 8వ తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్క్‌షాప్ జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి శ్రీకారం చుట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 450 మంది ఎస్ఎఫ్ఐ నాయకులు హాజరవుతారని చెప్పారు. విద్యారంగ సమస్యలపై చర్చిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు పి.సాను, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, విద్యావేత్తలు విచ్చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, అరవింద్, దేవ, ఉదయ్ పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - వల్లూరు : మానవుని మనవడుకు చెట్లే ప్రాణవాయువు అని కొల్లూరు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఆధ్వర్యంలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటిన వాటి బాగా పెంచినందుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఔషధ గుణాలున్న మొక్కలు ఇంట్లో పెంచుకోవడం ద్వారా మన ఇంట్లోనే సాంప్రదాయ వ్యాధులకు సత్వరమే చికిత్స అందించవచ్చు అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి ఎల్. నాగేశ్వర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ గుత్తి రెడ్డి మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు శ్యాంసుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆభరణాలు ప్రదర్శిస్తున్న మహిళలు

మలబార్‌లో 'మైన్' డైమండ్ షో

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచంలో అతి పెద్ద జ్యూవెలరీ సంస్థ ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కడప షోరూంలో మైన్ డైమండ్స్ షోని ప్రారంభించింది. శుక్రవారం షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల మహిళలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ లెసన్ సత్యన్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుందని పేర్కొన్నారు. డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలు ప్రదర్శిస్తున్నామని చెప్పారు. కొనుగోలు చేయాలనుకునే బంగారం విలువలో 10శాతం ముందుగా చెల్లించే అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం ఉందని తెలిపారు. భవిష్యత్తులో పెరిగే బంగారం ధర నుంచి లబ్ధిపొందవచ్చన్నారు. మైన్ డైమండ్స్ షోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కడప మార్కెటింగ్ హెడ్ ఇషాక్‌బాష, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పీస్ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎంపికైన విద్యార్థితో కోచ్‌లు

నగరంలోని మరియాపురం ఎస్‌బిఐ కాలనీలో ఉన్న పీస్ ఇసామిక్ ఇంటర్నేషన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి కరాటేలో అద్భుత ప్రదర్శన చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 26న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అంతర్ జిల్లాల పోటీలు కడప ఇండోర్ స్టేడియంలో నిర్వహించారని తెలిపారు. అందులో రాణించారని చెప్పారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అక్టోబర్ 6,7,8 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో షేక్.ఇబ్రహీం పాల్గొంటాడని పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న స్టాంప్ రైటర్లు

మైదుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా బాషా

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్‌రిజిస్ట్రార్‌గా శుక్రవారం డిఎం బాషా బాధ్యతలు చేపట్టారు. గతంలో సబ్‌రిజిస్టర్‌గా పనిచేసిన మారుతి ప్రసాద్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డిఎం బాషా మాట్లాడుతూ రైతులు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం స్టాంప్‌రైటర్లు బాషాను సన్మానించారు. కార్యక్రమంలో స్టాంప్ రైటర్లు శ్రీనివాసులరెడ్డి, రవికుమార్, రాజు, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పిహెచ్‌సి, అర్బన్ పిహెచ్‌సిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసు కోవాలన్నారు. దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గన్యా తదితర వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కొన్ని ఇళ్లను స్వయంగా ఆయన పరిశీలించారు. వెంటిలేషన్ సౌకర్యం కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య, వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, జ్యోత్స్న, ప్రియాంక, సిబ్బంది ప్రసాద్, రాఘవేంద్ర రాజు, రవిశంకర్ రాజు, ఓబులేసు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ వర్కర్లు, సచివాలయ అడ్మిన్, సెక్రటరీ పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని ఎర్రబల్లిలో ఫ్రైడే-డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫివర్, లార్వా సర్వే నిర్వ హించారు. నిల్వ ఉన్న నీటిలో అబేట్ పిచికారి చేశారు. ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యకమంలో ఎంపిహెచ్ఇఒ సతీష్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, ఎంఎల్‌హెచ్‌పి వైభవి, ఆరోగ్య కార్యకర్త లక్ష్మీ భార్గవి, ఆశా కార్యకర్తలు కమలమ్మ, రామలక్షుమ్మ పాల్గొన్నారు.

'ఆయాగా తొలగించి వేధిస్తున్నారు'

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడు జిఎఎస్ జిల్లా పరిషత్ పాఠశాలలో అయిదేళ్లుగా ఆయా (స్వీపర్)గా పనిచేస్తున్న తనను అక్రమంగా తొలగించి స్థానిక నాయకులు వేధిస్తున్నారని శ్రీపతి కుమారి శుక్రవారం ఆరోపించింది. చాపాడులో ఆమె మాట్లాడుతూ.. పేద ఎస్‌సి కులానికి చెందిన తమపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపట్టారని వాపోయింది. కొన్నేళ్లుగా పాఠశాలలో ఆయాగా కసువు ఊడ్చడం, మరుగుదొడ్లు కడగడం వంటి పనులు చేస్తూ ప్రభుత్వం వారు మంజూరు చేస్తున్న వేతనంతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల తర్వాత స్థానిక నాయకుల నుంచి ఒత్తిడి ప్రారంభమైందన్నారు. అధికారులు తనకు తగు న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది.

12వ పిఆర్‌సి అమలులో జాప్యమెందుకో? : ఎస్‌టియు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమలులో జాప్యం ఎందుకని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు సురేష్‌బాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఎస్టీయు కార్యాలయంలో రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన వేంపల్లె రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన దాటిన తర్వాత కూడా ఈ రాష్ట్రంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదని తెలిపారు. ఇది సగటు ఉద్యోగులలో ఆందోళన కలిగిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా మాట్లాడుతూ పిఆర్‌సి 2023 జూలై నుంచి అమలు చేయాల్సి ఉండగా జరుగుతున్న జాప్యం కారణంగా తక్షణమే ప్రభుత్వం 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొత్త పిఆర్‌సి కోసం కమిటీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని కోరారు. అనంతరం వేంపల్లె, చక్రాయపేట మండలాల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ ప్రాంతీయ కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీర్‌ఖాన్, సుధాకర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామమోహన్, శివారెడ్డి, మండల శాఖల ప్రతినిధులు లక్ష్మీనరసింహా, జనార్దన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎర్రగుంట్ల రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఎర్రగుంట్ల-కమలాపురం రైల్వేస్టేషన్ల మధ్య ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని పోలీసులు తెలిపారు. అతని వయస్సు 20నుంచి 25ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలని ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు సూచించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ.2 లక్షలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది ఆగస్టు 13న కదిరి రింగ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో జరిగిన చోరీ కేసులో సురేష్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి సాకే మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చోరీ కేసుకు సంబంధించి ఎస్పీ ఆదేశాల మేరకు అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్, ట్రాఫిక్ సీఐ హాజీవల్లి, ఎస్ఐ నారాయణతో ఒక టీంను ఏర్పాటు చేశామన్నారు. చోరీకి పాల్పడిన సురేష్‌కుమార్‌ను శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేశామన్నారు. ఇతని వద్ద ఉన్న రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కేసుకు సంబంధించి మరో నిందితుడు అలెగ్జాండర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కానిస్టేబుల్ భాస్కర్ ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళి నాయక్

నిధుల కొరత.. పనులు నిలిపివేత

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

నిధుల కొరతతో మండలంలోని సోమిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పనులు ప్రారంభించారు. అయితే పాంశాల అభివద్ధికి సరిపడా నిధులు లేక పనులు మధ్యలో ఆగిపోయాయి. ప్రభుత్వం మారింది. పాఠశాలలో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం కనికరించి నిధులు విడుదల చేసి పాఠశాలను అభివృద్ధి చేస్తుందా.. అరకొర పనులతో పాఠశాల అలాగే నిలిచిపోతుందా అని స్థానికుల్లో చర్చ జరుగుతోంది. సమ్మిళిత అధికారులు చొరవ చూపి పాఠశాలలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అధికారంలో ఉన్న పార్టీలు ప్రవేశపెట్టిన పథకాలు హౌసింగ్, నాడు-నేడు తదితర పనులను పట్టించుకొనకపోతే లబ్ధిదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

పనులు నిలిచిపోయిన సోమిరెడ్డిపల్లె పాఠశాల

హత్య కేసులో 12 మందికి యావజ్జీవ శిక్ష

- ఒకొక్కరికి రూ.4,70 లక్షల జరిమానా

ప్రజాశక్తి - చాపాడు

16 సంవత్సరాల క్రితం మైదుకూరు మండలం సర్వాయిపల్లె గ్రామంలో జరిగిన హత్య కేసులో ప్రొద్దుటూరు సెకండ్ ఎడిజె కోర్టు తీర్పు నిచ్చింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. నిందితులైన ములపాక పిచ్చిరెడ్డి, జంగంరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి పెద్ద ఓబుల్‌రెడ్డి, జంగంరెడ్డి నడిపి సుబ్బారెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి ఓబుల్‌రెడ్డి, తవ్వా ఎర్రయ్య గారి లక్ష్మిరెడ్డి, జంగంరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, జంగంరెడ్డి వీరారెడ్డి, రెడ్డెం పెద్దసుబ్బారెడ్డి, ముత్తూరు వెంకటరెడ్డి, జంగంరెడ్డి సుధాకర్‌రెడ్డి, జంగంరెడ్డి సూర్యనారాయణరెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, ములపాక సుధాకర్‌రెడ్డి, మూలపాక రామసుబ్బారెడ్డి, తవ్వా మునీంద్రారెడ్డి, తవ్వా మునిరెడ్డి, ములపాక సువిగారి సుబ్బారెడ్డి, జంగంరెడ్డి రామసుబ్బారెడ్డి, జంగంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ములపాక వీరారెడ్డి, ములపాక జంగంరెడ్డిగారి సుబ్బరామిరెడ్డిది సర్వాయిపల్లె గ్రామం. వీరంతా అంగన్వాడీ కేంద్ర నిర్మాణం, సిమెంట్ రోడ్డు కాంట్రాక్ట్ పనులు ఫిర్యాదు వర్గానికి వచ్చాయని తెలిసి అసూయపడ్డారు. ఏ22 ముద్దాయి అయిన ఎంజె సుబ్బరామిరెడ్డి ప్రోద్బ లంతో 2008, డిసెంబర్ 22న రాడ్లతో, వేటకొడవళ్లతో, కట్టెలతో బీచు పుల్లారెడ్డిపై దాడి చేయగా రక్త గాయాలతో చికిత్స పొందుతూ మర ణించాడు. అలాగే నల్లపు రెడ్డి వెంకటరమణారెడ్డితోపాటు బాలనాగిరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డికి రక్త గాయాలయ్యాయి. అనంతరం మైదుకూరు పిఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో పొద్దుటూరు సెకండ్ ఎడిజె కోర్టులో విచారణ జరిగి నిందితులు 12 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, ఒకొక్కరికి రూ.4.70 లక్షల జరిమానా విధిస్తూ సెకండ్ ఎడిజె ప్రొద్దుటూరు కోర్టు జడ్జి జిఎస్ రమేష్‌కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ కేసు విచారణలో ఉండగా వివిధ అనారోగ్య కారణాలతో 9మంది నిందితులు చనిపోగా.. తవ్వా ఎర్రయ్యగారి పెద్ద ఓబుల్ రెడ్డి మీద నాన్ బెయిలబుల్ వారెంట్ ఉంది. అప్పటి మైదుకూరు అర్బన్ సిఐ బాల స్వామిరెడ్డి నిందితులను అరెస్ట్ చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును పర్య వేక్షిస్తూ సకాలంలో సాక్షులను కోర్టుకు హాజరుపరిచి నిందితులకు శిక్ష పడేలా ప్రస్తుత మైదుకూరు అర్బన్ సిఐ సయ్యద్ హషం, ప్రొద్దుటూరు రూరల్ పిఎస్ కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ ఎ.నాగరాజు మైదుకూరు ప్రాసెస్ కానిస్టేబుల్ బి.రాజశేఖర్ కృషి చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అడిష నల్ పిపి బి.రాం ప్రసాద్ రెడ్డి బలమైన వాదనలతో నిందితులకు శిక్ష పడేలా చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

'టిటిడిని బజారుకీడ్చిన సిఎం చంద్రబాబు'

మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపిపై బురదజల్లేందుకు తిరుమల తిరుపతి దేవస్థానంను ముఖ్యమంత్రి చంద్రబాబు బజారుకీడ్చడం సరైంది కాదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిటిడి సంస్థను రద్దు చేసి ఇతరులకు అప్పగించాలనే దురుద్దేశంతో సిఎం చంద్రబాబు పన్నగాలు పన్నినట్లు ఆరోపించారు. చంద్రబాబు తొందరపాటు చర్యలతో ప్రస్తుతం టిటిడి బోర్డు అప్రతిష్ట పాలైందని విమర్శించారు. దర్శనం, ప్రసాదాలు, క్యూలైన్ పద్ధతులను హిందువులంతా గమనించాలని కోరారు. టిటిడి ఇఒ శ్యామల్ రావు, సిఎం చంద్రబాబు పొంతనలేని మాటలు మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. జూన్ 12న తిరుమల లడ్డూలో ఉపయోగించే నెయ్యిపై కల్తీ ఉందని చెప్పినప్పుడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉందో వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప, వైసిపిపై నిందలు మోపడం తగదన్నారు. నిరాధారమైన ఆరోపణలు ఎదుర్కొనేందుకు జగన్‌రెడ్డి తిరుమలకు బయల్దేరితే రానివ్వమంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు కొత్త నాటకాలు సృష్టిస్తే ప్రజలు నమ్మరని తెలిపారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నేతలకు నోటీసులు జారీ : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు తిరుమలకు వైసిపి నేతలు వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఉన్న వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డికి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిలతోపాటు పలువురికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. వారి ఇళ్ల వద్ద పోలీసులు కాపలా ఉన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటడడంతో జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. పులివెందులలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో అండర్-14 లో తనుశ్రీ మొదటి స్థానంలో రాగా, అండర్-17 విభాగంలో పార్వతి మొదటి స్థానంలో రాణించినట్లు చెప్పారు. విద్యార్థుల విజయం వారికి భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించడానికి ప్రేరణగా నిలవాలని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి కోరారు. ఫిజికల్ డైరెక్టర్ సుందర్ రెడ్డి, ప్రసాద్‌ను అభినందించారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పర్యటన

వేంపల్లె : అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణ పర్యటనకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు వెళ్లారు. శుక్రవారం పర్యావరణ పర్యటనకు అటవీ శాఖ అధికారులు శ్రీకారం చుట్టడంతో మండలంలోని ఇడుపులపాయ అడవులు, ఎకోపార్క్, అనిమల్ పార్క్ పరిసర ప్రాంతాలను ఫారెస్ట్ రేంజ్ అధికారి బాల సుబ్రమణ్యం విద్యార్థులకు చూపించారు. అడవుల వల్ల చాలా ఉపయోగం ఉందన్నారు. అడవులను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఎడ్యుకేషనల్ పర్యటన అనేది విద్యార్థులకు చాలా ఉపయోగ పడుతుందని వివరించారు. అడవులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డిఆర్‌ఒ సుబ్బయ్య, మధు, మనోహర్‌రెడ్డి, రెడ్డి కుమారి, సుబ్బారాయుడు, బేబి, సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిపల్లెలో డిగ్రీ విద్యార్థుల శ్రమదానం

వేంపల్లె : మండలంలోని నందిపల్లె గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దత్తత తీసుకున్న నందిపల్లె గ్రామాన్ని దర్శించారు. నందిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల వద్ద పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చలపతి, ఉమాదేవి, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - చాపాడు

విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చర్చా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అంశాలలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. వ్యాసరచన పోటీలలో కస్తూర్బా పాఠశాలకు చెందిన దివ్య కుళాయమ్మ మొదటి స్థానంలో నిలువగా.. లక్ష్మీపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బి వీరమమత రెండవ స్థానంలో నిలిచింది. వకృత్వ పోటీ లలో లక్ష్మీపేట పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జి సింధు మొదటి స్థానంలో, చాపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎస్ ఆస్మా సుల్తానా రెండవ స్థానంలో నిలిచారు. చర్చ పోటీల్లో ఆస్మా సుల్తానా మొదటి స్థానంలో, ఎం జాహ్నవి ద్వితీయ స్థానంలో నిలిచింది. మెదటి స్థానంలో నిలిచిన విద్యా ర్థులు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశాన్ని పొందారని తెలిపారు. కార్యక్ర మంలో ఎంఇఒ వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు గౌస్ మోద్దీన్, ఉపాధ్యా యులు, రమణ బాబు, చంద్రశేఖర్, రాజశేఖర్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజన్ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, చర్చ గోష్టిపై పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎర్రగుంట్లకు చెందిన ఎం.సంగీత(9వ తరగతి), వకృత్వపు పోటీలో మొదటి స్థానంలోనూ, ఇదే పాఠశాలకు చెందిన ఎం.మణి (9వ తరగతి) వ్యాసరచన పోటీలో మొదటి స్థానంలో మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోట్లదుర్తి సి.శివతేజవతి (10వ తరగతి) మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎర్రగుంట్ల విద్యార్థిని ఎస్ సన (10వ తరగతి) వీరిరువురు చర్చ గోష్టి పోటీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఎంపికైన వారు రేపు అనగా 28-09-2024 నాడు జిల్లా స్థాయిలో కడప నగరంలో మున్సిపల్ హై స్కూల్ గాంధీ నగర్ లో పాల్గొంటారు అని మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మరియు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై విద్యార్థులకు అవగాహన

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సహజ యోగా ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ టి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. యోగా గురువు గురూజీ వెంకట్రామిరెడ్డి సహజ యోగా ధ్యానం చేయించి వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులలో జ్ఞాపకశక్తి, చురుకుదనం, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ ఎలా అభివృద్ధి చెందుతాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ఎల్ తరుణ్ ఇంద్ర శేఖర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కెసి కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పాటిమీదిపల్లె పరిధిలో కెసి కాలువకు సంబంధించి ఉప కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. కాలువలు పూడిపోవడంతో చివరి ఆయికట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొనేవారు. సమస్యను గ్రామ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, జెసిబి యంత్రం సాయంతో కాలువలో ఉన్న పూడిక తొలగించేలా చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పనులు పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ లక్ష్మిరెడ్డి

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఇ.పి.నెంబర్ : 36/2019

ఓ.ఎస్.నెంబర్ : 7/2019

వనం రామాంజనేయులు, తండ్రి భూషన్న, వయసు 34 సంవత్సరాలు, గూడెం చెరువు గ్రామం, జమ్మలమడుగు మండలం, కడప జిల్లా. ...పిటిషనర్/డి. హెచ్. ఆర్

వర్సెస్

బూరన్ మహబూబ్ బాషా, తండ్రి లాలూ సాహెబ్, వయసు 35 సంవత్సరాలు, జమ్మలమడుగు టౌను మరియు మండలం, కడప జిల్లా. ...రెస్పాండెంట్/జె.డి.ఆర్

నోటీసు

పిటీషనర్ రెస్పాండెంట్ అయిన మీ పైన డిగ్రీ మొత్తాన్ని వసూలు చేయునిమిత్తం నీపై అమలు దావా దాఖలు చేసియున్నారు. 04.10. 2024 తేదీకి వాయిదా పడినది. కావున సదరు వాయిదా తేదీనాడు ఉదయం 10 గంటల లోపల నీవు కానీ, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవచ్చును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేదీ 04.10.2024

వై.సూర్య పెద్దిరాజు,
అడ్వకేట్, జమ్మలమడుగు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మంత్రి లోకేష్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రవీణ్ రెడ్డి

పొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో ఇసుక కొరత లేకుండా చేసి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆ మేరకు శుక్రవారం మంగళగిరిలో మంత్రి నారా లోకేష్‌ను ఆయన ఇంట్లో కలిసి వినతిపత్రమిచ్చారు. ప్రొద్దుటూరులోని పలు సమస్యలను లోకేష్‌కు వివరించారు. గత వైసిపి పాలనలో ఇసుక పాలసీ వల్ల భవన నిర్మాణ కార్మికులు నానా అవస్థలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఉపాధి లేక ఆకలితో అలమటించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుందా అనే సందేహాలకు తావు లేకుండా చేయాలన్నారు. నిర్మాణ రంగంపైనే ఆధార పడిన 42 రకాల కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో చట్ట వ్యతిరేకంగా, ఎలాంటి ప్రణాళిక లేకుండా జరుగుతున్న కూల్చివేతలను ఆపాలని నారా లోకేష్‌ను కోరారు.

నీట్ ర్యాంక్ సాధించిన విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక సుంకేసుల రోడ్డులోని సాయితేజ పాఠశాల పూర్వ విద్యార్థి, బీసీ కాలనీకి చెందిన గురు వెంకట జ్యోతి స్వరూప్ జాతీయస్థాయి నీట్ పరీక్షలో 1,857 ర్యాంక్ సాధించింది. కర్నూలు మెడికల్ కళాశాలలో సీట్ సాధించింది. ఈ సందర్భంగా సాయితేజ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెను సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి వసూళ్లను ఆపండి

- కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి పాముల బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

16వ వార్డు సచివాలయం దగ్గర తాగునీటి వసూళ్లను ఆపాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌ఛార్జి పాముల బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో ఫిల్టర్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి, ఆ ప్లాంటును జమ్మలమడుగు మున్సిపాలిటీకి అప్పగించారన్నారు. బిందె నీరు కొద్ది రోజులు రూ.2, రూ.3లు వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.5 వసూలు చేస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు రూ.16,18,705 నిర్వాహకులతో కట్టించే చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న టీచింగ్ ప్యాకల్టీ సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటికి విచ్చేసిన ఆర్జీయూకేటీ రిజిస్టర్ అమరేంద్ర కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. టీచింగ్ ప్యాకల్టీ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం రిజిస్ట్రార్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీచింగ్ ప్యాకల్టీ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

వేంపల్లె : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్వామి వివేకానంద విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. గండి గురుకుల పాఠశాల మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల ఎంపికలోతమ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. అకుంఠిత కృషి, మంచి శిక్షణతో విద్యార్థులు ఎంపికైందుకు పిఈటి పద్మజను కర స్పాండెంట్ అభినందించారు.

దాతృత్వం చాటుకున్న ఉపాధ్యాయులు

చక్రాయపేట : గత నెల 26న గువ్వల చెరువు ఘాట్ రోడ్ ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ షరీఫ్ కుటుంబానికి ఉపాధ్యాయులు, స్నేహితులు అండగా నిలిచారు. వారి సాయంతో రాబట్టిన రూ.66 వేల నగదు, అయిదు సంచుల బియ్యం మండల విద్యాశాఖాధికారులు జాఫర్ సాదిక్, రవికుమార్ శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్ర్యమంలో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ పగడాల రమేష్, ఉపాధ్యాయ సంఘ నాయకులు గంగారపు శివారెడ్డి, భాస్కర్, దాదాపీర్, శ్రీనివాసులు, ఎరికల్ రెడ్డి, ధర్మారెడ్డి, కుళాయి బాబు, ఖాదర్‌ఖాన్, సుబ్రమణ్యం, స్థానిక ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

నగదు, బియ్యం అందజేస్తున్న ఉపాధ్యాయులు

FORM NO. 14 [See Regulation 33(2)]
By Regd. A/D, Dasti failing which by Publication.

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)
1st Floor, Triveni Complex Abids, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/297/2019. 28-08-2024

State Bank of India
Versus
Modem Srinivasulu Srinivasa Rao And Another

To
(CD 1) Sri Modem Srinivasulu @Srinivasa Rao, S/o Late Venkata Subbaiah, D No 3/78, Brahman Street, Siddavataram, YSR Cuddapah-516 237, A.P.
(CD 2) S Srinivasulu, Occ: Asst Divisional Enigneer, O/o Occ, Sub Division, A.P.S.P.D.C.L, YSR Cuddapah District, A.P.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2) in OA/486/2017 an amount of Rs 3044938.00 (Rupees Thirty Lakhs Forty Four Thousands Nine Hundred Thirty Eight Only) along with pendentellite and future interest @ 10.25% Simple Interest Yearly w.e.f. 09.04. 2019 till realization and costs of Rs 0 (Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 16/10/2024 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date: 28/08/2024.

Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)